
# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్‌రాజు





## -56-

## చలికాలంలో ఉద్యానవనం కథ

**రెండు, మూడేళ్ళ క్రితం** మనకి ఓపిక ఎలాగా తగ్గింది కదా, మొక్కల చుట్టూ గడ్డి పీక లేకపోతున్నాం, ఆఖరికి పాదులకి నీళ్ళు పొయ్యడానికి కూడా 'బద్ధక వ్యాధి' పెరిగిపోయింది కాబట్టి మా ఇంటి బాక్ యార్డ్ అనబడే తోటలో పనీపాటులు బాగా తగ్గించేశాను. అప్పుడప్పుడు కొంత మంది..కొంత మంది ఏమిటి లెండి,,అనేక మంది మిత్రులు వాళ్ళింట్లో పండిన ఒకే ఒక వంకాయని అనేక భంగిమలలో ఫొటోలు తీసేసీ, ఐదు మిరపకాయలని యాభై లాగా కనపడేలాగా, ఒక దోశకాయ, రెండు కాకర కాయలు, మూడు కాయలు , బహుశా బజార్లో కొన్న రెండో టొమేటోలు ఉన్న కలిసి మెల్సిస్ నిండుగా ఉన్న ప్లాస్టిక్ బుట్ట ఫొటోలు పెడుతున్నా అవి చూసి "నువ్వూ ఉన్నావు, ఎందుకూ?" అని మా క్వీన్ విక్టోరియా గొడవ పెడుతున్నా నేను దున్నపోతు మీద వాన పడినట్టుగా గత రెండేళ్ళగా ఏమీ పట్టించుకో లేదు. అయినా మా తోటలో ఉన్న పది కుండీలకీ పాతిక ఫొటోలు తీసి యాభై లైకులు కొట్టించుకున్న సందర్భాలూ ఉన్నాయి. లైకులా, మజాకాయా!

అయితే నెలా, రెండు నెలల క్రితం నాకు మళ్ళీ మొక్కల ఆవేశం వచ్చింది. ఎందుకంటే మాకు తెలిసిన ఒకావిడ ఇంటికి "కోవిడ్ వీడ్కోలు పార్టీ" వెళ్ళగానే ఆవిడ మా ఇద్దరినీ అర్జంటుగా వాళ్ళ ఇంటి వెనకాల తోట లోకి తీసుకెళ్ళి, "ఇదిగో మిరప, ఇది తెల్ల వంగ, ఇది గుత్తొంకాయ అనుకుంటూ అన్నీ చూపిస్తూ "ఇదిగో రాజు గారూ గుర్తు పట్టారా ..మీరు పదేళ్ళ క్రితం మా గృహ ప్రవేశానికి వచ్చినప్పుడు ఇచ్చిన దొండ పాదు. ఇంకా హాయిగా పాకుతూనే ఉంది. మా మిత్రులు చాలా మంది ఇళ్ళలో దీని కాండలే ఇప్పుడు అందరికీ దొండకాయలు కాచి పెడుతున్నాయి " అనగానే నా బుర్ర నలభై మూడేళ్ళు అనగా 1978 సంవత్సరానికి వెళ్ళి పోయింది. అదే నేను ఆమెరికా వచ్చాక మొట్ట మొదటి సారి ఇండియా వెళ్ళి రావడం, ఎలాగా అంత దూరం వెళ్ళాం కదా అని అప్పుడే ఆవిడని పెళ్ళి కూడా చేసుకుని వచ్చాను...అవును ఆవిడనే!. ఆ రోజుల్లో అమెరికాలో దొరకని మన కూరగాయలలో దొండకాయ అతి ముఖ్యమైనది.

అంచేత నేను కష్టమ్స్ వాళ్ళ కన్నుకప్పడానికి రెండు దొండ కాండలని ..నమ్మండి..నమ్మక పొండి... పొట్టకి పురి కొస తాడుతో కట్టుకుని ఆ పది హేను గంటల విమాన ప్రయాణం లోనూ వాటిని కాపాడుకుంటూ ...హ్యూస్టన్ కి బంగారం కణికెల కంటే జాగ్రత్తగా తీసుకొచ్చి మా తోటలో వేసి బతికించాను. అలాగే తుని తమలపాకు పాదుని కూడా దొంగతనంగా టెక్సస్ కి తీసుకొచ్చిన ఘనత కూడా మనదే!. ఏడాది తర్వాత ఆ దొండ పాదు బలం పుంజుకోగానే ఆ కాండలు స్నేహితులు అందరికీ ఇచ్చాను. యదావిధిగా ఆ విషయం కాలక్రమేణా అందరూ మర్చిపోయారు. ఇప్పుడు ఈవిడ మళ్ళీ మా దొండపాదు మనవడినో మనవరాలినో మాకు చూపించగానే "మా ఇంట్లో దొండ చచ్చే పోయింది. ఎవరు పుణ్యం కట్టుకున్నారో" అంటూ మా క్వీన్ విక్టోరియా గారు మళ్ళీ అదే లుక్కుతో "నువ్వూ ఉన్నావు ఎందుకూ? అని అదే వాక్కు. అది విని ఆ ఇంటాయన "అయ్యో, దానికేముంది. ఉండండి" అని అర్జంటుగా ఒక చిన్న పారతో ఆ దొండ పాదు పెద్ద వేరు దగ్గర పెరుగుతున్న రెండు, మూడు కాండలు ఉన్న పిల్ల దొండపాదులని తవ్వి "మీ ఇంట్లో వెయ్యండి, మా బాకీ తీరిపోయింది" అని మా చేతిలో పెట్టాడు. అప్పుడు నేను గత్యంతరం లేక అత్యంత పేలవంగా నవ్వి, మా అర్ధాంగి వేపు నిస్సహాయంగా చూసి మరొక వెకిలి నవ్వు నవ్వాను. ఈ విధమైన నా నవ్వుల పరంపరకి కారణం ఏమిటంటే ఈ సదరు దొండ పాదుని ఇప్పుడు మా తోటలో వెయ్యడానికి సరి అయిన చోటు లేనే లేదు. ఇది వరకూ పాదులు వేసిన చోట అంతా ఇప్పుడు గడ్డి పెరిగిపోయింది. ఆ పందిళ్ళు ఎప్పుడో పీకేశాం. ఇప్పుడు పుట్టింటి కొచ్చిన ఈ దొండ పాదు కోసం మళ్ళీ ఇల్లు పీకి పందిరి వెయ్యాలి. పైగా ఇప్పుడు ఈ దొండ పాదు ఇచ్చిన ఆసామీ వారానికో సారి మా ఇంటికొచ్చి అది ఎలా పెరుగుతో పెరుగుతోందో, అసలు పెరుగుతోందో చస్తోందో చూడ్డానికి వచ్చి చావగొట్టే టైపు ఆసామీ.

అంతే..ఇక నాకు "ఉద్యోగ వనావేశం" వచ్చేసింది. మళ్ళీ మా జిల్లాలో ప్రధాన వ్యవసాయ దారుడి ముద్ర వేయించుకోవాలనే కోరిక నా మెదడుని దొల్చేయడం మొదలెట్టింది. నా ఆవేశం అమలు పరచడానికి మొదటి మెట్టు ప్రస్తుతం అరణ్యావస్థలో ఉన్న మా బాక్ యార్డ్ ని పూర్తిగా శుభ్రపరచడం. ఆ తర్వాత సరి కొత్త లాండ్ స్కేపింగ్ డిజైన్ చేయించడం. అంటే ఏ మొక్కలు ఎక్కడ వెయ్యాలి, ఎక్కడ రాళ్ళు పరచాలి, ఎక్కడ పాదులు వెయ్యాలి,..ఇలాంటివన్నీ ముందే ప్రణాళిక వేయించాలి. ఆ తర్వాత అవన్నీ చేయించాలి. నా హడావుడి చూసి "వెర్రి ముదిరింది తలకి రోకలి చుట్టుకో" అని సలహా ఇచ్చింది మా క్వీన్ విక్టోరియా. నేను ముందు పెద్ద పోటు గాడి లాగా ఇద్దరు, ముగ్గురు ప్రొఫెషనల్ లాండ్ స్కేపింగ్ వాళ్ళని పిలివగానే వాళ్ళు వచ్చి 'ఎత్తెంత, లోతెంత, వెడల్పెంత" చూసుకుని సుమారు పది హేను వేల డాలర్లు బడ్జెట్ ఇవ్వగానే నా ఆవేశం నీరు గారి పోయింది. ఆ బడ్జెట్ చూడగానే "అంత డబ్బు పెట్టావంటేనా?" తన చూపుడు వేలు శరవేగంతో ఊగిసలాడిస్తూ "నాడా దొరికింది. ఇక గుర్రం కొనేటట్టులా ఉంది. ఆ వెధవ దొండ పాదు వెనక్కి ఇచ్చేసి రా. కిలోకి డాలరున్నరకి వందేళ్ళ కి సరిపడా పటేల్ బ్రదర్స్ లో ఆ మాత్రం దొండ కాయలు కొనుక్కోవచ్చును" అంది మా క్వీన్ విక్టోరియా. ఇక్కడ నాకు నచ్చని విషయం ఏమిటంటే బడ్జెట్ ఎంత ఎక్కువ అయితే

మటుకు, ఎంత కోపం వస్తే మటుకు, ఇలా నోటికొచ్చినట్టు మాట్లాడడం ఆవిడకి తగదు కదా! కావాలంటే ఆ ఆసామీని ఏమైనా అనవచ్చును కానీ నా పొట్ట మీద కూచుని ఇండియా నుంచి అమెరికా దాకా ప్రయాణం చేసిన నా ప్రియాతిప్రియమైన దొండ పాదు మనవడిని పట్టుకుని "వెధవ" అంటుందా? ఇప్పుడు నాకు నిజంగానే పంతం పెరిగిపోయింది. ఏమైనా సరే, ఇప్పుడు రాబోయేది శీతాకాలమే అగు గాక....మా తోటని నందనవనంగా తీర్చిదిద్దడమే కాక ఆ బుజ్జి దొండపాదుని బతికించి తీరతాను, వచ్చే వసంత ఋతువు నాటికి అది ఆకులు తొడిగి, పిందెలు పెట్టి మా ఇద్దరికీ సరిపడా దొండకాయలు పండించి తీరతాను అని శపథం చేసేసుకుని మా వసుదేవుడి కాళ్ళ మీద పడ్డాను...కాదు, కాదు వాసుదేవుడు. వసుదేవుడి కాళ్ళ మీద పడ్డను అంటే నా గురించి అపార్థం చేసుకుంటారు.

మా వాసుదేవుడి ఈనాటి అవతారం పేరు హొజె హెర్నాండెజ్. ఆ యుగంలో ఆయన గొర్రెల కాపరి. ఈ యుగంలో గడ్డి కోయువాడు. మెక్సికన్ అవతారం కాబట్టి సహజంగానే "భూమి పురుషుడు"..అంటే మట్టి పనులు బాగా చేసేవారు. నా మొత్తం ప్రణాళిక అతనికి కాళ్ళా, వేళ్ళా పడి వివరించాను. కాళ్ళా వేళ్ళా పడడానికి కారణం అతనికి స్పానిష్ భాష తప్ప మరే భాషా రాదు అతనికి నా లాండ్ స్కేపింగ్ ప్రణాళిక అర్థం అవడానికి ఇలా రకరకాల వెకిలి వేషాలు వెయ్య వలసి వచ్చింది అనమాట. ఏ కళని ఉన్నాడో కానీ "చేస్తాను. కానీ ఒకటే కండిషన్" అన్నాడు మా హొజె. నేను కొంచెం భయం, భయంగానే "ఏమిటి నీ కండిషన్" అని అడగానే "మీ క్వీన్ విక్టోరియా ఇందులో ఏ మాత్రం కలగజేసుకో కూడదు. అంతే". వాడు అలా అనడానికి కారణం నాకు తెలుసు. ఎందుకంటే మనమేమో డాలర్ పని చేస్తే రెండు డాలర్లు ఇచ్చే చేతికి ఎముక లేని బాపతు. ఆవిడేమో సరిగ్గా దానికి వ్యతిరేకం. మరీ రాచి రంపాన పెట్టే బాపతు కాదు కానీ ఇచ్చిన డబ్బు కంటే కాస్త ఎక్కువ పని రాబట్టే బాపతే.


ఇక మా తోటని ఎలా తీర్చి దిద్దాలో నేనే డిజైన్ చేశాను. అఫ్ కోర్స్. మా వాసుదేవుడు లేనప్పుడు అన్నింటి లోనూ మా క్వీన్ విక్టోరియా సలహాలు తీసుకోవడం, ఎడా, పెడా దెబ్బలాడుకోవడం, ఉస్కో అంటే ఉస్కో అనుకోవడం..అన్నీ మామూలే. మొత్తానికి మా తోటని ఐదు భాగాలుగా విభజించాం. గరాజ్ వెనకాల బీర, ఆనప్, పొట్ల, దోస, కాకర, చిక్కుడు...అవును మా బుజ్జి దొండ పాదు కోసం పందిళ్ళూ, గరాజ్ పక్కనే ఎదురుగుండా కనపడేలా రక రకాల పువ్వుల మొక్కలూ, వెనకాల ఫెన్స్ దగ్గర అటూ, ఇటూ అరటి చెట్లూ, వాటి మధ్య నంది వర్ధనం, పెద్ద గన్నేరు లాంటి పెద్ద పువ్వుల మొక్కలూ, పక్క డేవిడ్ ఇంటి ఫెన్స్ వేపు శీతాకాలం లో కాపు కాసే కేబేజీ, కాలీ ఫ్లవర్, బ్రాక్లీ అనే అమెరికా కూర, మన కొత్తి మీర, మెంతి, చుక్క కూరలు, వంగ ..వీటన్నింటికీ కూరగాయల స్థలం, ఇక మధ్యలో ఉండే వాటర్ ఫౌంటెన్ కి ఒక పక్క మల్లె పొదలు, చుట్టూ రకరకాల పూల కుండీలు....మరొక పక్క కుండీలలో టొమేటో మొక్కలు....మరొక పక్క ఆరు అడుగులు ఎదిగే కర్వేపాకు చెట్లు వెరసి మా "శీతలోద్యానవనం" తయారు అయింది. కాస్త సొగసుగా ఉంటుంది కదా అని తోటలోకి వెళ్ళే గుమ్మం లాగా ఒక పెద్ద ఆర్చి కూడా పెట్టాం. శీతాకాలం లో కూడా నవ్వుతూ పువ్వులు పూసే

గులాబీలు, ఇతర పువ్వుల మొక్కలూ కొనడానికి మా ఊరికి 60 మైళ్ళ దూరం లో బ్రెనమ్ అనే నగరానికి వెళ్ళాల్సి వచ్చింది. నిన్న సరదాగా లెక్క పెడితే ఇప్పుడు మా శీతాకాల ఉద్యాన వనంలో 8 రంగుల గులాబీలు, ఐదు రంగుల మందారాలు, పదికి పైగా మల్లె మొక్కలు, చంద్రకాంతలు, కనకాంబరాలు, వందకి పైగా బిళ్ళ గన్నేరు మొక్కలు, బంతి, చేమంతి, పది ఎజీలియా పువ్వుల మొక్కలు. స్నాప్ డ్రాగన్, లాంటానా, డైసీస్ లాంటి పన్నెండు రకాల అమెరికా పువ్వుల మొక్కలు, మన అరటి మొక్కలు,..ఇలా రక రకాల మొక్కలున్నాయి. ఆ మధ్యలో బెంచీ మీద కూచుని ఒక తెలుగు పుస్తకం చదువుకోడం అన్నా, పౌర్ణమి నాడు మా తాటి చెట్టుకి ఒక దిక్కు నుంచి రెండో దిక్కుగా ప్రయాణం చేసే అమెరికా చంద్రుడిని చూస్తూ ఆనందించడమన్నా నాకు భలే ఇష్టం. అప్పుడప్పుడు మా క్వీన్ విక్టోరియా కూడా పక్కనే కూచున్నప్పుడు ఎలా ఉంటుందో ఊహించుకోండి...వనకన్య అవతారం లో అవిడ మా ఉద్యానవనంలో అడుగుపెడుతున్న ఫొటో, మరికొన్ని ఫొటోలు ఇక్కడ జతపరిచాను..మీ కోసం! మరి కొన్ని ఫొటోలు ఫేస్ బుక్ లో....









COMMENTS